సాక్షి చిత్తూరు
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



అడవికి నిప్పు

గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టిన సంఘటన శ్రీరంగరాజపురంలో గురువారం చోటు చేసుకుంది. - 8లో



నామసంకీర్తన దేవునికి ప్రీతికరం

సమస్యల నుంచి బయటపడేందుకు మానవులు చేసే నామ సంకీర్తన దేవునికి ప్రీతికరమని విద్యాప్రసన్నతీర్థ స్వామీజీ అన్నారు. - 8లో



కల్యాణం..వైభోగం

నారాయణవనం కనకవల్లి, వేదవల్లి సమేత వీరరాఘవస్వామి కల్యాణం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

సీఎం జగన్‌కు ఎంపీ రెడ్డెప్ప స్వాగతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ చేరుకోగానే గురువారం రాత్రి చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనని నియమించినందుకు ముఖ్యమంత్రికి ఎంపీ రెడ్డెప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పలు అంశాలపై చర్చించారు.

జిల్లా కార్మికశాఖాధికారికి రాష్ట్ర అవార్డు



అవార్డును అందుకున్న జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేసినందుకు జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావుకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. గురువారం ఐజేఎం అనే ఎన్జీఓ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేసిన అధికారులకు రాష్ట్ర అవార్డులు ప్రదానం చేశారు. జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు అవార్డును సీఐడీ ఏడీజీపీ సంజయ్ చేతుల మీదుగా అందుకున్నారు.

నులిపురుగుల నివారణకు కృషి

చిత్తూరు రూరల్: నులిపురుగుల నివారణకు కృషి చేయాలని, విధిగా అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె గురువారం అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 1–19 ఏళ్ల పిల్లల వరకు మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం పిల్లలకు మాత్రలు ఇవ్వలన్నారు. 5,237 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 3,63,556 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వారందరికీ అధికారులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు విధిగా మాత్రలు మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని 16వ తేదీలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు సిద్ధం కండి

చిత్తూరు కలెక్టరేట్ : ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు సిద్ధం కావాలని డీఈఓ దేవరాజు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి గాను ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 417 ప్రాజెక్టులతో విద్యార్థులు, గైడ్ టీచర్ తప్పనిసరిగా పాల్గొనేలా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ 9701871545 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,683 మంది స్వామివారిని దర్శించుకోగా 21,177 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


నేషనల్ వర్క్‌షాపు ప్రారంభం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్స్ అండ్ సెరికల్చర్ ఆధ్వర్యంలో గురువారం జీవవైవిధ్యం, క్లిష్టమైన పరిశీలన అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డీ.మమత ముఖ్యఅతిథిగా విచ్చేసి వన్య ప్రాణుల సంరక్షణ, పక్షులు, క్షీరదాల సంరక్షణలో తీసుకోవలసిన ప్రధాన అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న దీవెన

ఇది కదా.. అభివృద్ధి

విదేశీ విద్య నేటి విద్యార్థుల కల. సామాన్య కుటుంబాలకు అది ఎండమావే. రూ.లక్షలు ఖర్చు చేయాల్సిరావడమే ఇందుకు కారణం. అదీ పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలంటే అంత తేలిక కాదు. వారి జీవితాల్లో అసాధ్యమనుకున్న ఘనతను వారి ప్రతిభ ద్వారా సుసాధ్యం చేస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. బడుగు, బలహీన వర్గాల యువత చిరకాల స్వప్నం జగనన్న (విదేశీ విద్యా) దీవెనతో సాధ్యమవుతోంది.



జగనన్న విదేశీ విద్యాదీవెన మెగా చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

- అన్ని వర్గాలకు అందుబాటులో విదేశీ విద్య
- బాబు పాలనలో కంటితుడుపుగా విదేశీ విద్యావకాశాలు
- పేద విద్యార్థుల తలరాత మార్చిన జగనన్న
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రూ.7.03 కోట్లు ఖర్చు

చిత్తూరు కలెక్టరేట్ : విదేశీ విద్య పేదలకు దుర్లభం. ఎందుకంటే రూ.లక్షల ఫీజులు, ఇతర ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పేద విద్యార్థులు తమ ఆశలను వదులుకునే వారు. ఈ విషయం గుర్తించిన వైఎస్సార్ సీపీ సర్కారు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం అమలు చేసి, పేద విద్యార్థులకు అండగా నిలిచింది. ఈ పథకంతో అంతర్జాతీయ యూనివర్సిటీల్లో ఉచితంగా విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు పేదలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.

నాడు మోసం

టీడీపీ హయాంలో పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలంటే కుదరని పరిస్థితి. చంద్రబాబు పాలనలో విదేశీ విద్యా పథకం అమలు చేసినప్పటికీ ఒకరిద్దరికి మాత్రమే అవకాశం కల్పించేవారు. ఆ ఇద్దరు కూడా జన్మభూమి కమిటీల సిఫార్సులు, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2019కి ముందు విదేశీ విద్య మిథ్యగా మిగిలింది.

నేడు న్యాయం

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి అర్హులైన విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. అన్ని సామాజిక వర్గాల్లో విద్యార్థులను విదేశాల్లో విద్యనభ్యసించేందుకు వెసులుబాటు కల్పించారు. విదేశాల్లో చదవాలనుకునే పేద విద్యార్థుల కలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థులకు విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో చదివే అవకాశం కల్పించి, వారి తలరాత మార్చారు.

అన్ని సామాజిక వర్గాలకు లబ్ధి

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో అన్ని సామాజిక వర్గాలకు మేలు చేకూర్చింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వైఎస్సార్ సీపీ సర్కారు ఆర్థిక సహాయం అందజేసి మేలు చేసింది.

రూ.7.03 కోట్లు ఖర్చు

విదేశీ విద్యాదీవెన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు, తిరుపతి జిల్లాలో రూ.7.03 కోట్లు ఖర్చు చేసింది. బీసీ, ఈబీసీ, కాపు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఈ పథకంలో మేలు చేకూర్చారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో చిత్తూరు జిల్లాలో 17 మంది, తిరుపతి జిల్లాలో 13 మంది విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో 17 మందికి రూ.3.69 కోట్లు, తిరుపతి జిల్లాలో 13 మందికి రూ.3.34 కోట్లు మొత్తం రూ.7.03 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఆ విద్యార్థులు చదువు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

ఊహించ లేదు



నాకు విదేశాల్లో చదివే అవకాశం వస్తుందని ఊహించలేదు. నేను తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదివాను. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న వ్యవసాయం చేస్తూ డిగ్రీ వరకు చదివించారు. ఆపై చదువులు చదివించాలంటే కుదరని పని. ఆ దశలో జగనన్న విద్యాదీవెన పథకంతో డిగ్రీ పూర్తి చేశాను. ఆ తరువాత విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యాను. ప్రస్తుతం విదేశాల్లో పీజీ చదువుతున్నాను. సీఎం అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకం నగదు నాకు సక్రమంగా అందుతోంది. నా విదేశీ విద్య సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన మేలు వల్లే.

– అనిత, తిరుపతి జిల్లా

సీఎం పుణ్యమే



విదేశాల్లో చదవాలంటే రూ.లక్షలు ఉండాల్సిందే. వ్యవసాయ కుటుంబానికి చెందిన మాకు అంత స్తోమత లేదు. నేను డిగ్రీ వరకు తిరుపతి జిల్లాలో చదువుకున్నాను. తల్లిదండ్రులు డిగ్రీ వరకు ఎంతో కష్టపడి చదివించారు. ఆపై చదువుల భారం తల్లిదండ్రులు భరించే పరిస్థితుల్లో లేరు. ఇలాంటి పరిస్థితుల్లో పీజీ చేరే స్తోమత లేక చదువు మానేద్దామని అనుకున్నాను. అయితే జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకోగానే ఎంపికయ్యాను. ఈ పథకం నాకు వరంలాగా మారింది. గతంలో ఏ నాయకుడూ చేయని సాయం, సీఎం జగనన్న మా కోసం చేశారు. ప్రస్తుతం విదేశాల్లో చదువుకుంటున్నానంటే అది సీఎం పుణ్యమే.

– సుభాషిణి, తిరుపతి జిల్లా

నాకు భవిష్యత్తును ఇచ్చారు



నా తండ్రి రైతు. ఐరాల మండలానికి చెందిన నేను అమెరికాలో చదువుకుంటానని కలలో కూడా అనుకోలేదు. అయితే జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో నాకు భవిష్యత్తు కల్పించారు. ప్రభుత్వం విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించగానే దరఖాస్తు చేసుకున్నాను. ఏ అధికారి వద్దకు వెళ్లకుండానే పథకానికి నేను అర్హత పొందాను. అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఉన్న న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులో అడ్మిషన్ దొరికింది. త్వరలో విదేశాల్లోకి వెళుతున్నాను. నా భవితకు బంగారు బాటలు వేసిన జగనన్నకు నేను రుణపడి ఉంటాను. సీఎం చేసిన మేలు ఎప్పటికీ మరువలేనిది.

– పూజిత, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా

జగనన్న దేవుడు



నాది రాష్ట్ర సరిహద్దులోని నగరి మండలం రామాపురం అనే చిన్న గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. నా తండ్రి చంద్రశేఖర్ నాయుడు రైతు, తల్లి వాణి గృహిణి. మా ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే. విదేశాల్లో మాస్టర్ ఆఫ్ డేటాసైన్స్ చదవాలన్నది నా కల. విదేశీ విద్యకయ్యే ఖర్చు మా కుటుంబానికి పెద్ద భారం. ఈ క్రమంలో విదేశీ విద్యాదీవెన పథకం నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యాను. నాకు రూ.55 లక్షలు విదేశీ విద్యాదీవెన కింద ప్రభుత్వం చెల్లించింది. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మొనాస్ట్ యూనివర్సిటీలో నాకు అడ్మిషన్ వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాకు వరం ఇచ్చి, నా పాలిట దేవుడయ్యారు.

– చంద్రసాయికృష్ణ, రామాపురం, నగరి మండలం

రూ.30 లక్షలు ఇచ్చారు



మాది చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం గురుకులవారి పల్లె. నాన్న రమాకాంత్ చౌదరి, తల్లి జలజ. చిన్నప్పటి నుంచి విదేశాల్లో చదవాలన్నది నా కోరిక. బీటెక్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత విదేశాల్లో చదవాలంటే అంత స్తోమత మా తల్లిదండ్రులకు లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్ అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకంలో అమెరికాలో ఎంఎస్ చేసే అదృష్టం నాకు దక్కింది. నా చదువుకు అవసరమైన డబ్బులు ప్రభుత్వమే ఇస్తోంది. ఇప్పటివరకు నా చదువుకు అవసరమైన రూ.30 లక్షలు ప్రభుత్వం అందజేసింది. సీఎం సార్‌కి రుణపడి ఉంటాను. – నిషిత, విద్యార్థిని, తవణంపల్లె, చిత్తూరు జిల్లా

మేలు మరువలేనిది



మాది గుడిపాల మండలం బొమ్మసముద్రం. మాది మధ్య తరగతి కుటుంబం. నేను చిరువ్యాపారం చేస్తుంటాను. మా పిల్లలను విదేశాల్లో చదివించే స్తోమత మాకు లేదు. అయితే మా పాప రమ్యశ్రీ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి అర్హత పొందింది. దీంతో లండన్‌లోని వార్మిక్ యూనివర్సిటీలో విద్యనభ్యసించే అదృష్టం మాపాపకు దక్కింది. మాకన్నా మా పిల్లల భవిష్యత్ గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇంతలా మేలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలను చేరువచేస్తోంది.

– భానుప్రకాష్, విద్యార్థిని తండ్రి, బొమ్మసముద్రం, గుడిపాల మండలం

పీహెచ్‌డీ కోర్సుకు సాయం



మాది రైతు కుటుంబం. నేను ఇంజినీరింగ్ వరకు పూతలపట్టులోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకున్నాను. ఆ తర్వాత విదేశాల్లో పీహెచ్‌డీ చదువుకోవాలన్నది నా ఆశ. విదేశాల్లో పీహెచ్‌డీ చదివించే స్తోమత మా తల్లిదండ్రులకు లేదు. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకం నాకు వరంలా మారింది. ఈ పథకంలో ఇటలీలోని బొలోగ్నా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం దక్కింది. నా కోర్సుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటి వరకు రూ.4 లక్షలు అందజేసింది. నేను విదేశాల్లో పీహెచ్‌డీ చదువుతున్నానంటే సీఎం జగన్ సార్ వల్లే.

– మమత, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

సీఎం దయతోనే విదేశీ విద్య



మాది సూళ్లూరుపేట. నేను ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాను. నా బిడ్డను విదేశాల్లో చదివించే స్తోమత లేదు. అయితే ఏ నాయకుడు సిఫార్సు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి నా కుమారుడు పవన్ కుమార్ ఎంపికయ్యాడు. దీంతో నా కొడుకు ప్రస్తుతం అమెరికాలో కంప్యూటర్ అనాలసిస్ట్ కోర్సు చేస్తున్నాడు. అబ్బాయిని కంప్యూటర్ అనాలిసిస్ కోర్సు పూర్తి చేయించడం ఎలా అన్న పరిస్థితుల్లో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా రూ.12.50 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. మా ఇంటిల్లిపాది సీఎం జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– ప్రవీణ్‌కుమార్, విద్యార్థి తండ్రి, సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా

గతంలో ఏ నాయకుడూ మేలు చేయలేదు



నేను కూరగాయల వ్యాపారం చేస్తుంటాను. మాది బీసీ కులం. నా కుమార్తె రుచితకు విదేశీ విద్యాదీవెన పథకంతో విదేశాల్లో చదివే అవకాశం దక్కింది. కూరగాయల వ్యాపారం చేసుకునే నేను మా పాపను విదేశాల్లో చదివిస్తానని కలలో కూడా అనుకోనేలేదు. ఈ పథకంలో ఎంపికైన నా కుమార్తె ఆస్ట్రేలియాలోని మొనాష్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. ఇందుకోసం రూ.13.94 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇప్పటి వరకు పేద పిల్లల కోసం జగన్‌మోహన్‌రెడ్డి లాగా మేలు చేసిన నాయకుడు ఎవరూ లేరు. ఆయన చేసిన మేలు ఎప్పటికీ మరిచిపోము.

– వరాలు, విద్యార్థిని తండ్రి, చిత్తూరు

శాస్త్రోక్తంగా కుంభ కలశ పూజ



క్షీరతత్పరణం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

- అమ్మవారి అనుగ్రహం ఆలయ నిర్మాణం
- మంత్రి ఆర్కే రోజా

నగరి : పట్టణ పరిధిలో నేత్ర ప్రదాయని దేశమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో నాలుగో రోజైన గురువారం కుంభ కలశ పూజ, బింబ సంస్కారం, క్షీరతత్పరణం, చతుర్విదహోమ పూజలు వైభవంగా జరిగాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఈ పూజలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రితోపాటు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు ఆలయ కమిటీ చైర్మన్ అమ్మవారి కండువాలు వేసి, సత్కరించారు. అనంతరం మంత్రి రోజా చతుర్విద హోమ పూజల్లో పాల్గొన్నారు. తరువాత బింబ సంస్కారపూజల్లో పాల్గొని, ఆలయంలో ప్రతిష్ఠించే పరివార దేవతా బింబాలు, గోపుర కలశాలను ఆలయ ప్రాంగణంలోకి వేంచేపు చేసి, పూజలు చేశారు. క్షీరతత్పరణలో భాగంగా బింబాలు, కలశాలకు వేదపండితులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ పూజలను వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమ్మవారి చలవతో రెండు సార్లు నగరి నియోజకవర్గం నుంచి గెలుపొందానన్నారు. అమ్మవారి అనుగ్రహం తనకు ఉన్నందునే ఆమె ఆలయాన్ని నిర్మించే మహత్కార్యాన్ని తన ద్వారా చేయిస్తున్నారని తెలిపారు. ఇది తన భాగ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



కలశాన్ని తీసుకువస్తున్న మంత్రి ఆర్కే రోజా

ధ్రువపత్రాలు సులువుగా జారీ చేయండి

చిత్తూరు అర్బన్: వివాహ రిజిస్ట్రేషన్లు, జనన, మరణ ధ్రువపత్రాల జారీ సులభంగా, వేగంగా జారీ చేయాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. వివాహాల రిజిస్ట్రేషన్లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలపై గురువారం నగరపాలక కార్యాలయంలో పంచాయతీరాజ్, నగరపాలక సంస్థ, జిల్లా రిజిస్ట్రార్ శాఖల అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాల రిజిస్ట్రేషన్, జనన, మరణ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మనిషి జీవితంలోనూ ఈ మూడు అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ధ్రువపత్రాల జారీ పారదర్శకంగా జరగాలన్నారు. ఈ చట్టాలపై సామాన్య ప్రజలకు ప్రాథమిక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా వివాహాల రిజిస్ట్రేషన్లపై విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు, తప్పనిసరిగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేయించేలా చూడాలన్నారు. నగర కమిషనర్ జె అరుణ మాట్లాడుతూ జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ పరిధిలో పక్కాగా నిర్వహిస్తున్నామని, జడ్జి సూచనల మేరకు మరింత విస్తృతంగా సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివాహ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేసేలా ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ కె. శ్రీనివాసరావు చెప్పారు. ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో ధ్రువపత్రాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేయించి, ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మి, సహాయ కమిషనర్ గోవర్ధన్, పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, ఏఎస్వోలు సౌందర్య రాజన్, నరసింహ పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

డీఈఓగా దేవరాజు బాధ్యతల స్వీకరణ



నూతన డీఈఓ సి.దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖాధికారిగా సీ దేవరాజులు గురువారం చిత్తూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వైఎస్సార్ కడప జిల్లా ఏడీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై చిత్తూరు డీఈఓగా ఇక్కడికి విచ్చేశారు. 2008లో చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఆయన సూపరింటెండెంట్‌గా 2011 వరకు విధులు నిర్వహించారు. ఆ తర్వాత వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన ఆ జిల్లాలో సూపరింటెండెంట్‌గా, ఏడీ, ఇన్‌చార్జి డీఈఓగా పనిచేశారు. ఈ సందర్భంగా దేవరాజులు విలేకరులతో మాట్లాడుతూ పది పరీక్షల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. డీవైఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంల సమన్వయంతో త్వరలో జరిగే పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపడతామన్నారు. ఆయన్ని కార్యాలయ ఏడీలు విజయేంద్రరావు, వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్లు సత్య, వీజీ రమణ, సిబ్బంది మురళి, నాగరాజు, జయప్రకాష్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

టీచర్‌పై ఫిర్యాదు



డిప్యూటీ కలెక్టర్ వెంకటశివకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిపై పాఠశాల విద్యార్థులు గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎన్నికల కోసం జీడీ నెల్లూరు జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను పరిశీలించడానికి డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆ పాఠశాలకు విచ్చేశారు. ఆయన వచ్చిన విషయం గుర్తించిన విద్యార్థులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మధ్యాహ్న భోజనం విషయంలో తమను అసభ్య పదజాలంతో దూషిస్తుందని ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో విచారణ జరిపి, సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు తిరిగి తమ తరగతి గదులకు చేరుకున్నారు.

బాలుడి ప్రాణం తీసిన బెలూన్




కరెంట్ షాక్‌తో మృతి చెందిన బాలుడు, రంజిత్‌కుమార్ (ఫైల్)

గంగవరం: ఒక బెలూన్ కోసం బాలుడు ప్రాణం పోగొట్టుకున్న సంఘటన మండలంలో గురువారం వెలుగుచూసింది. సీఐ చిన్నగోవింద్ కథనం మేరకు గండ్రాజుపల్లె పంచాయతీ అనంతపురానికి చెందిన జయరాం, గాయత్రి దంపతుల పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్(8) బుధవారం సాయంత్రం బెలూన్‌తో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో పైకెగిరేసిన బెలూన్ ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్‌పై పడడంతో తీసుకోవాలని షెడ్‌పైకి ఎక్కాడు. పక్కనే ఉన్న ఇనుప కమ్మీతో బెలూన్ తీసుకోవాలని ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం బాలుడు మృతి చెందాడు. బాలుడి బాబాయి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధి వినాయక స్వామి గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

కాణిపాకం (యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వైభవం, ఉపాసన విధానం గ్రంథాన్ని విజయవాడలోని సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఉదయం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు గ్రంథ పరిశోధకులు డాక్టర్ శ్రీష్టి, లక్ష్మీ సీతారామాంజనేయ శర్మ తదితరులు గ్రంథాన్ని సీఎం వద్దకు తీసుకెళ్లారు. తొలుత కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అర్చకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, దేవదాయశాఖ మంత్రితో కలసి గ్రంథాన్ని ఆవిష్కరించారు. కాణిపాకం చరిత్రను రాష్ట్రంలోనేగాక దేశవ్యాప్తంగా తెలిసేలా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకోవడానికి తాను త్వరలోనే కాణిపాకం దేవస్థానానికి విచ్చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు. స్వామివారి గ్రంథం ప్రచురణకు అయిన ఖర్చును ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ విరాళంగా అందజేశారు. వారికి కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల సీఏ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఫలితాల్లో ఆర్.సత్యా 314, ఎం.లావణ్య 265, కె.శ్రియ 259, ఆర్.యశ్వంత్ 257, దివాకర్‌రెడ్డి 256 మార్కులు సాధించారు. ఈ ఫలితాల్లో 56.34 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి(అలిపిరి): వైఎస్సార్ జిల్లా దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణ జరుగనుందని టీటీడీ ఈఓ. ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. 10న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. 15న ఉదయం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనే గృహస్తులు (ఇద్దరు) రూ.300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 19న సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పుష్పయాగానికి భక్తులు పుష్పాలను సమర్పించవచ్చన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్వీయూలో 'వర్క్‌షాప్ ఆన్ చెస్'

తిరుపతి సిటీ: ఎస్వీయూ చెస్ క్రీడలో శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో వర్క్‌షాప్ ఆన్ చెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన విద్యార్థినులకు ఎస్వీయూలో నిపుణులైన కోచ్‌ల ద్వారా చదరంగం క్రీడలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా చెస్‌కు సంబంధించి బేసిక్ రూల్, చెస్‌లో టెక్నిక్స్, సింపుల్ మెథడ్‌తో గేమ్‌ను ప్రారంభించడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాల విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం రూ.100 చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీపీ బాలచంద్ర 8019100750, కోచ్ వీ.బాలాజీ చౌదరి 9441661610 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. గురువారం భాకరాపేట అటవీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తలకోన అటవీ ప్రాంతంలోని సెంట్రల్ బీట్ పరిధిలో బుధవారం రాత్రి కూంబింగ్ చేపట్టామన్నారు. గురువారం తెల్లవారు జామున ఎర్రచందనం దుంగలను తీసుకుని వస్తున్న స్మగ్లర్లను గుర్తించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా.. గమనించిన స్మగ్లర్లు దుంగలు కిందపడేసి పారిపోయేందుకు ప్రయత్నించారని, అందులో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు. నిందితుడు తమిళనాడు రాష్ట్రం శుభాకర్‌గోవిందరాజ్‌గా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో 378 కిలోల బరువు గల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వాటి విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ ఇచ్చిన సమాచారం మేరకు పారిపోయిన 11 మంది కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. దాడుల్లో ఎఫ్ఎస్ఓ సల్లావుద్దీన్, ప్రదీప్‌చాంద్, లక్ష్మీప్రసాద్, రాజేష్, శంకర్, బేష్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అడవికి నిప్పు

శ్రీరంగరాజపురం: గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టిన సంఘటన శ్రీరంగరాజపురం మండల కేంద్రానికి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీరంగరాజపురం గ్రామానికి సమీపంలో అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దట్టమైన మంటలు అలుముకున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న వృక్షాలు కాలిపోయాయి. అడవి కాలిపోతున్నా అటవీశాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనంతోపాటు నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

వి.కోట: ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులోని వి.కోట మీదుగా అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు గురువారం వి.కోట పోలీసులు తెలిపారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఐ లింగప్ప ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. రామకుప్పం మండలానికి చెందిన వసంత్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కొంతకాలంగా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సీఐ ఆధ్వర్యంలో బైరుపల్లె క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఎర్టిగా వాహనం పోలీసులను చూసి వెనక్కి తిప్పుకుని పరారు కావడాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వాహనాన్ని వెంబడించి, పట్టుకుని, పరిశీలించారు. అందులో 23 బాక్సుల ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్ ప్యాకెట్లు, 90 ఎంఎల్ సిల్వర్ కప్ పాకెట్లు 5 బాక్సులను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో మద్యంపాటు ఎర్టిగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రామకుప్పం మండలం కవంపల్లెకు చెందిన వాహన డ్రైవర్ అరుణ్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు అదే మండలం చిన్నబల్దారు గ్రామానికి చెందిన వసంత్ కుమార్‌రెడ్డి పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యాడు. స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనం విలువ మొత్తం రూ.6 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు.

తేనెబండలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని తేనెబండలో గురువారం టూటౌన్ పోలీసులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 ప్యాకెట్లను కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉలసయ్య తెలిపారు.

నామసంకీర్తన భగవంతునికి ప్రీతికరం



నామ సంకీర్తనకు హాజరైన భజన మండళ్ల సభ్యులు

తిరుమల: మానవులు సమస్యల వలయం నుంచి బయటపడేందుకు అనుసరించే నామ సంకీర్తన భగవంతునికి ప్రీతికరమని కర్ణాటకలోని కుక్కే సుబ్రమణ్యస్వామి మఠాధిపతి విద్యాప్రసన్నతీర్థ స్వామీజీ ఉద్ఘాటించారు. శ్రీపురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో విద్యాప్రసన్నతీర్థ స్వామీజీ ప్రసంగిస్తూ భగవంతుడిని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమన్నారు. ఈ కోవకు చెందిన శ్రీవారి పరమభక్తుడు శ్రీ పురందరదాసు అన్నారు. నేడు వేలాదిమంది భక్తులు పురందరదాసు రచించిన లక్షలాది కీర్తనలు ఆలపిస్తూ స్వామివారి కృపకు పాత్రులవుతున్నారని, ఇదే కలియుగంలో నామసంకీర్తనకున్న వైశిష్ట్యమన్నారు. దాససాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న భజన మండళ్ల సభ్యుల కృషిని కొనియాడారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ, 4.75 లక్షల సంకీర్తనలు రచించడం దైవాంశ సంభూతుడు, సాక్షాత్తు నారద స్వరూపులైన శ్రీ పురందరదాసుకే సాధ్యమైందని తెలిపారు. అనంతరం స్వామీజీని శాలువ, శ్రీవారి ప్రసాదంతో సన్మానించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. దాస సంకీర్తనలను భజన మండళ్ల సభ్యులు చక్కగా ఆలపించారు.

9న సంకీర్తనాలాపన

ఆరాధనోత్సవాల్లో రెండోరోజు శుక్రవారం సంగీత, సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. అలాగే సాయంత్రం తిరుమల నారాయణగిరి ఉద్యానవనాలకు శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి శ్రీ పురందరదాస సంకీర్తనల బృందగానం నిర్వహిస్తారు. టీటీడీ దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం..వైభోగం

నారాయణవనం: స్థానిక కనకవల్లి, వేదవల్లి సమేత వీరరాఘవస్వామి కల్యాణం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. వీరరాఘవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కనకవల్లి, వేదవల్లి సమేత వీరరాఘవ స్వామికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో పద్మశాలి దంపతులు, మహిళలు పాల్గొని తరించారు. శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై వీరరాఘవ స్వామి ఊరేగింపు ఉంటుందని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది.

తమిళ బియ్యం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న అధికారులు

పలమనేరు: తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని తిరుపతి విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. కొంతకాలంగా పలమనేరు మీదుగా అక్రమంగా బియ్యం తరలుతున్నట్లు తిరుపతి విజిలెన్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు పలమనేరు సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నిఘా ఉంచారు. ఆ సమయంలో అటుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి, తనిఖీ చేశారు. అందులో తమిళనాడు నుంచి పీడీఎఫ్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో వాహనంలోని 3 టన్నుల బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి చెందిన సర్దార్ అనే డ్రైవర్ గుడిపాలకు చెందిన అబ్దుల్‌సలాం నుంచి తమిళనాడు బియ్యాన్ని కొనుగోలు చేసి, కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తున్నట్టు విచారణలో తెలిసిందన్నారు. ఇందులో కీలక ముద్దాయిగా బైరెడ్డిపల్లె మండలం హరి అని తేలిందన్నారు. ప్రస్తుతం పట్టుబడిన డ్రైవర్ సర్దార్‌తో పాటు ప్రధాన నిందితుడు హరి, సలాంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టిబడిన బియ్యాన్ని స్థానిక డీటీ రిషివర్మ, వీఆర్వో ప్రకాష్‌కు అప్పగించినట్టు తెలిపారు.

ఏనుగుల బీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇల్లు, సామగ్రి

పెద్దపంజాణి: మండలంలోని బొంతలవారిపల్లె సమీపంలోని పొలం వద్ద నివాసం ఉంటున్న ఓ రైతు ఇంటిపై బుధవారం ఏనుగులు దాడి చేసి, బీభత్సం సృష్టించాయి. బాధితుని కథనం మేరకు.. మండలంలోని బొంతలవారిపల్లెకు చెందిన సుబ్రమణ్యం గ్రామానికి సమీపంలోని తన పొలంలో ఇల్లు కట్టుకుని, కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గురువారం వేకువజామున పొలంలోకి వచ్చిన ఏనుగుల శబ్దాన్ని విన్న సుబ్రమణ్యం కుటుంబ సభ్యులతో కలసి భయంతో గ్రామంలోకి పరుగులు తీశారు. ఉదయం గ్రామస్తులతో కలసి పొలం వద్దకు వెళ్లి చూడగా ఏనుగులు ఇంటితోపాటు ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి ఉండడాన్ని చూసి ఆవేదనకు గురయ్యాడు. ఈ దాడుల్లో సుమారు రూ. 50 వేల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం తనని ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు రూరల్: స్థానిక సంతపేటలోని పాంచాలీపురంలో గురువారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ ఉలసయ్య తెలిపారు. రహస్య సమాచారం మేరకు దాడులు చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.